క్లుప్తంగా

తాగునీటి ఎద్దడి నివారణకు బోర్లు ఏర్పాటు



నూతనబోర్లు వేయిస్తున్న సర్పంచ్

ఆత్మకూరు: మండలంలోని కొట్టాల చెర్వు చెంచుగూడెంలో తాగునీటి సమస్య పరిష్కారానికి బుధవారం బోర్లు వేయించినట్లు గ్రామ సర్పంచ్ నాగలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు కోట్ల రాజ్యలక్ష్మి తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చెంచుగూడెం సందర్శించినప్పుడు స్థానికులు తాగునీటి సమస్య ఉందని ఆయనకు ఫిర్యాదు చేయడంతో సమస్యను పరిష్కరించారన్నారు.

విశేష పూజలు



సాక్షిగణపతి,



జ్వాలావీరభద్రస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతికి అభిషేకం, జ్వాలావీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు. సాక్షిగణపతి స్వామికి పంచామృతాలు, ఫలోదకాలు, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలావీరభద్రస్వామివారికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు.

నష్టపరిహారం చెల్లించాలి

నందికొట్కూరు రూరల్: కర్నూలు నుంచి అమరావతి వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి 340 సీలో కోల్పోయిన భూములకు ఎకరాకు రూ.40 లక్షల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని బుధవారం దామగట్ల గ్రామ రైతులు నేషనల్ హైవే అథారిటీ పీడీ తరుణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ఎకరాకు రూ.2 లక్షల విలువ కట్టి ఏకపక్షంగా రైతుల ఖాతాల్లో జమ చేయడం తగదన్నారు. సమస్యను పరిష్కరించే వరకు తమ పొలాల్లో ఎలాంటి పనులు చేపట్టరాదని రైతులు కోరారు. రైతుల వెంట గ్రామ సర్పంచ్ మాధవరం సుశీలమ్మ ఉన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పగిద్యాల: ఆధార్ సమస్యల పరిష్కారం కోసం గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్న మొబైల్ క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 23 నుంచి 31వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ మొబైల్ క్యాంప్‌లను ప్రజల సౌకర్యార్థం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం నిర్ణయించిన రుసుం చెల్లించి ఆధార్‌లోని లోపాలను సరిదిద్దుకునే అవకాశం ఉందన్నారు. లోపాల సవరణకు సంబంధించిన డాక్యుమెంట్స్ తప్పనిసరిగా అప్లికేషన్‌కు జత చేయాల్సి ఉంటుందన్నారు. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం పగిద్యాల-2, లక్ష్మాపురం-1, 2, నెహ్రూనగర్-1, పాత ముచ్చుమర్రి సచివాలయాల్లో ఆధార్ క్యాంప్‌లు ఉంటాయన్నారు.

తాటిపాడులో నిలిచిన ఉపాధి పనులు

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామంలో ఉపాధి హామీ పనులు నిలిపివేయటంతో కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో 631 జాబ్‌కార్డులు ఉండగా అందులో 523 జాబ్‌కార్డులు యాక్టివ్‌లో ఉండగా అందులో 490 మంది దాకా పనులు కల్పిస్తున్నారు. బుధవారం నుంచి గఉపాధి పనులు నిలిపివేసినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ లింగన్న మేట్లకు తెలిపారు. కాగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు కొనసాగుతుండగా తమ గ్రామంలోనే ఎందుకు నిలిపేశారని కూలీలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఏపీఓ గౌరీబాయి, ఈసీ నజీర్‌బాషాను వివరణ కోరగా గ్రామంలో సరిపడా ఉపాధి పనులు లేకపోవడంతో పాటు ఉన్న వాటికి పంచాయతీ తీర్మానాలు లేకపోవటంతో నిలిపేసినట్లు తెలిపారు.

పైపులైను నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్, జెడ్పీటీసీ, చైర్మన్లు

మహానంది: మండలంలోని అబ్బీపురం గ్రామంలో రూ.5 లక్షలతో నూతనంగా నిర్మించనున్న పైపులైన్ నిర్మాణానికి సర్పంచ్ శవ్వా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కేవీఆర్ మహేశ్వర రెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ శరభారెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివ నాగజ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు విశేష సేవలు అందించిన వలంటీర్లను ప్రజాప్రతినిధులు, అధికారులు బుధవారం ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ పథకాలను పేదల దరికి చేర్చడంలో వీరి పాత్ర అమోఘమని కొనియాడారు. మరింత ఉత్సాహంగా పని చేసి ప్రజల మన్ననలు పొంది ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని పలువురు సూచించారు.



వలంటీర్లను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమిషనర్ కిషోర్

వలంటీర్లకు ఘన సత్కారం

నందికొట్కూరు/రూరల్: సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులకు ఎంపికైన 1, 5, 6 సచివాలయాల వలంటీర్లను పట్టణంలోని జైకిసాన్ పార్కులో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమిషనర్ కిషోర్, వైస్ చైర్మన్ ప్రశాంతి, కౌన్సిలరు హమీద్‌మియ్యా తదితరులు సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు నిత్యం సేవలందించే వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. అనంతరం సేవ వజ్ర అవార్డు పొందిన వారికి సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జి, మెడల్‌తో పాటు రూ.30 వేల నగదు, సేవ రత్న వలంటీర్లకు సర్టిఫికెట్, బ్యాడ్జి, శాలువా, మెడల్, రూ.20 వేల నగదు అందజేశారు. సేవా మిత్ర అవార్డుకు ఎంపికైన వారిని శాలువాతో సన్మానించారు. అలాగే దామగట్ల గ్రామంలో అవార్డులకు ఎంపికైన వలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శోభారాణి, ఈఓఆర్డీ సుబ్రమణ్యంశర్మ, సర్పంచ్ మాధవారం సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాసపేటలో వలంటీర్లను సన్మానిస్తున్న దృశ్యం

• మిడుతూరులో..

మిడుతూరు: మండల పరిధిలోని మాసపేట, కడుమూరు గ్రామాల సచివాలయాల్లో వలంటీర్లను శాలువాలు, ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు. మాసపేటలో జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో వలంటీర్లు అందించిన సేవలను కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో మాసపేట, కడుమూరు గ్రామ సర్పంచ్‌లు షంషూన్‌బీ, జీవరత్నం, ఎంపీటీసీ కమతం జయమ్మ, ఎంపీడీఓ జీఎస్ఎస్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరు జనార్దన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు అస్రఫ్‌బాషా, కళ్యాణ్ సింగ్ పాల్గొన్నారు.

• వెలుగోడులో..



వలంటీర్లను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

వెలుగోడు: మండల పరిధిలోని గుంతకందాల గ్రామంలో వలంటీర్లను ప్రజాప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మేలు అచ్చమ్మ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వలంటీర్ వ్యవస్థ ప్రజలకు ఉపయోగకరంగా ఉందన్నారు. వలంటీర్ల సేవలు మరువలేనివన్నారు.

• జూపాడుబంగ్లాలో..



జూపాడుబంగ్లా: సన్మానం పొందిన వలంటీర్లతో ప్రజాప్రతినిధులు, అధికారులు

జూపాడుబంగ్లా: మండలంలోని 80 బన్నూరు, తరిగోపుల గ్రామ సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు ప్రభుత్వం ప్రకటించిన సేవా పురస్కారాలను బుధవారం ఎంపీపీ సువర్ణమ్మ, ఎంపీడీఓ మంజులవాణి, ఈఓపీఆర్డీ మణిమంజరి, సర్పంచ్ శ్యామలమ్మ అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులను గుర్తించి, వారి వివరాలను సచివాలయాల్లో ఆన్‌లైన్ చేసి, సంక్షేమ పథకాలు అందించటంలో వలంటీర్ల కృషి ప్రశంసనీయమన్నారు.

• పగిద్యాలలో..



సన్మానం పొందిన వలంటీర్లతో ఎంపీడీఓ వెంకటరమణ, ఎంపీటీసీ ప్రియాంక

పగిద్యాల: వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని పురస్కరించుకుని మండలంలోని లక్ష్మాపురం-2, 3 సచివాలయాల పరిధిలోని పడమర ప్రాతకోట, ఎం.ఘణపురం గ్రామాల్లో చేపట్టిన వలంటీర్ల సన్మాన కార్యక్రమం వైభవంగా సాగింది. గ్రామ సర్పంచ్‌లు పిట్టల శేషమ్మ, ప్రతాపరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ వెంకటరమణ, ఎంపీటీసీ ప్రియాంక మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అవినీతికి తావులేకుండా ప్రజలకు చేరవేయడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. ఉత్తమ సేవలు అందించడం వల్లనే ప్రభుత్వం ఏటా సేవా మిత్ర, సేవారత్న, సేవావజ్ర అవార్డులతో సత్కరించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమం పేరుతో పెద్ద ఎత్తున నిర్వహించడం చారిత్రాత్మకమని తెలియజేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ పుల్లయ్య, సచివాలయ కార్యదర్శులు ఇషాంబాషా, శ్వేత, సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే జగనన్న ధ్యేయం

• నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

జూపాడుబంగ్లా: ప్రజాసంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పారుమంచాల గ్రామంలో మూడు రోజు బుధవారం సర్పంచ్ మాధవరం ప్రకాశం ఆధ్వర్యంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ, డ్రైనేజీలు, సిమెంట్ రోడ్లు, తాగునీటి సౌకర్యం, పక్కాగృహాలు, పింఛన్ల సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించగా వీలైనంత పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు. నివాసగృహాల మధ్య నుంచి శ్మశానవాటికను వేరేచోటికి మార్చే విషయమై ఫోన్‌లో కలెక్టర్‌తో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో లోకేష్ పాదయాత్ర చేపట్టి ఆపార్టీ నాయకుల్లో చిచ్చురేపటం తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. టీడీపీ పాలనలో పైసలిచ్చిన వారికి, పరపతి ఉన్నవారికి మాత్రమే సంక్షేమ పథకాలు దక్కేవన్నారు. ప్రస్తుతం కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. అందుకే మరోసారి జగనన్నను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దిలీప్‌రాజు, సొసైటీ చైర్మన్ ఈదుల నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తాటిపాడు ఉస్మాన్‌బాషా, తూడిచెర్ల సర్పంచ్ బాలమద్దిలేటి, తహసీల్దార్ పుల్లయ్య యాదవ్, సీఐ సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ మంజులవాణి, ఈఓపీఆర్డీ మణిమంజరి పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు





ప్రతిష్ఠోత్సవాల సందర్భంగా పూజలు చేస్తున్న కమిటీ పెద్దలు,పూజల్లో పాల్గొన్న దాతలు, పెద్దలు

మహానంది: బండిఆత్మకూరు మండలం సోమయాజులపల్లెలో నూతనంగా నిర్మించిన రామాలయం, శివాలయం, లింగమయ్యస్వామి ఆలయాల్లో బుధవారం విగ్రహప్రతిష్ఠోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి ప్రభాతపూజ, దీక్షాహోమం, యంత్ర స్థాపనలు, విగ్రహ ప్రతిష్ఠ, రక్షా, శాంతి హోమాలు, మహాపూర్ణాహుతి పూజలు వైభవంగా నిర్వహించారు. విగ్రహ, ధ్వజప్రతిష్ఠోత్సవాల సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఎంపీపీ దేరెడ్డి సంజీవరెడ్డి, సర్పంచ్ లావణ్య, వైఎస్సార్‌సీసీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ రామయ్య, కమిటీ సభ్యులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. భక్తులకు అన్నదానం నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు.

సీసీఆర్ కార్డులతో ప్రయోజనాలు



కృష్ణాపురంలో మాట్లాడుతున్న ఏడీఏ ఆంజనేయులు

ఆత్మకూరు: కౌలు రైతులకు ఇచ్చే గుర్తింపు కార్డులతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఏడీఏ ఆంజనేయులు తెలిపారు. కృష్ణాపురంలో రైతులు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఇతరుల భూమి కౌలుకు సాగు చేసే రైతులు తప్పనిసరిగా కౌలు గుర్తింపు కార్డు పొందాలన్నారు. వాటి ద్వారా యాజమాన్యానికి ఎలాంటి నష్టం ఉండదన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మహానంది: కౌలురైతులకు ప్రభుత్వం అందించే పంట సాగుహక్కు పత్రాల ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయిని వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. మసీదుపురం, గోపవరం గ్రామాల్లో బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కౌలు గుర్తింపు కార్డుకు 11 నెలల కాలపరిమితి ఉంటుందని, బ్యాంకుల నుంచి రుణాలు, కనీస మద్దతు ధర, వైఎస్సార్ భరోసా తదితర ప్రయోజనాలకు ఉపయోగపడుతుందని వ్యవసాయాధికారి వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు సంజీవరెడ్డి, ఏఈఓ శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ సహాయకులు హరిత, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: మల్యాల గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు కౌలు కార్డులపై మండల వ్యవసాయాధికారిని శ్రావణి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పంట సాగు హక్కు పత్రాలను పొందడం ద్వారా వైఎస్సార్ రైతుభరోసా, పంట నమోదు, పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర ప్రయోజనాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో వీఏఏ శాంతిరాజు పాల్గొన్నారు.

రుణాల మంజూరు

మహానంది: బండిఆత్మకూరు మండలం అయ్యవారి కోడూరు సొసైటీకి రూ.1.75 కోట్ల రుణాలు మంజూరైనట్లు సొసైటీ చైర్మన్ సుబ్రహ్మణ్యంరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రైతునేస్తం, చేయూత తదితర విభాగాల ద్వారా రుణాలు మంజూరు చేస్తూ సీఈఓ ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.

'కల్యాణమస్తు' నగదు జమ

మిడుతూరు: మండల పరిధిలోని మాసపేట గ్రామానికి చెందిన వధువు కొమ్ము శ్వేత తల్లి కొమ్ము రాణెమ్మ, పైపాలం గ్రామానికి చెందిన వధువు మొల్ల అబిదాబీ తల్లి మొల్ల రహమత్‌బీల అకౌంట్లలో వైఎస్సార్ కల్యాణమస్తు పథకం సాయం రూ.లక్ష చొప్పున బుధవారం జమ అయ్యింది. నగదు జమ ధ్రువపత్రాలను జెడ్పీటీసీ సభ్యుడు యుగంధర్‌రెడ్డి, పైపాలం సర్పంచ్ రామచంద్రుడు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మాసపేట సర్పంచ్ షంషూన్‌బీ, ఎంపీడీఓ జీఎస్ఎస్ రెడ్డి, ఉపసర్పంచ్ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు అస్రప్ బాషా, రవీంద్ర బాబు పాల్గొన్నారు.

మాన్యం భూములకు వేలంపాటలు



మాన్యం భూములకు వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలోని దేవదాయ మాన్యం భూములకు బుధవారం బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. రైతులు పోటాపోటీగా పాట పాడి చివరకు రూ.23.83 లక్షలకు ఏడాది సాకుగు దక్కించుకున్నారు. గ్రామంలోని శ్రీఈశ్వర స్వామి దేవస్థానము భూములు 21.33 ఎకరాలను రూ.4.68 లక్షలకు, శ్రీఎల్లమ్మ దేవతా దేవస్థానమునకు సంబంధించిన 49.27 ఎకరాలరె రూ.8.76 లక్షలు, శ్రీకేశవ రామచంద్ర, ఆంజనేయ స్వామి దేవస్థానముల భూములు 43.22 ఎకరాలను రూ.10.39 లక్షలకు వేలంలో రైతులు కౌలుకు దక్కించుకున్నారు. ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, కార్యనిర్వహణాదికారి వెంకటరమణ, దేవదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎఫ్‌ఓ కార్యాలయం ఎదుట గిరిజనుల ధర్నా



డీఎఫ్‌ఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న చెదరంపెంట చెంచుగిరిజనులు

ఆత్మకూరు: తమ భూములు అన్యాయంగా ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారని ఆరోపిస్తూ చెదరంపెంట చెంచు గిరిజనులు పట్టణంలోని డీఎఫ్‌ఓ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా చెంచుగిరిజనుల మహిళా నాయకురాలు భూమని లక్ష్మి, గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు జవహర్‌నాయక్ మాట్లాడుతూ 15 ఏళ్ల క్రితం అప్పటి జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓలు, కొత్తపల్లి తహసీల్దార్ కలిసి చెదరంపెంట, ఎర్రగుంట గూడేలకు చెందిన 40 కుటుంబాలకు పొలాలతో పాటు పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేశారన్నారు. ప్రస్తుతం వాటిని అటవీశాఖ అధికారులు ఫారెస్ట్ పరిధిలోనివని బలవంతంగా లాక్కోవడం అన్యాయమన్నారు. సత్వరమే భూములు చూపించి పేద, గిరిజనులను ఆదుకోవాలన్నారు. అనంతరం డీఎఫ్‌ఓ అలాన్‌ఛంగ్‌టెరాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఎఫ్‌ఓ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం తెలుపుతామని చెప్పారు.

బిల్లులయ్యేలా చర్యలు తీసుకోండి

కొత్తపల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు నిర్మించుకున్న గోకులం షెడ్ల బిల్లులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ మేరి సూచించారు. స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో సిబ్బందితో గోకులం షెడ్ల నిర్మాణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టెక్నికల్ అసిస్టెంట్లు గ్రామాల్లోని రైతుల వద్దకు వెళ్లి షెడ్ల నిర్మాణాలను తనిఖీ చేసి నివేదికలు సమర్పించి పూర్తిస్థాయిలో బిల్లులు మంజూరు చేయించేలా చూడాలన్నారు. ఈ ప్రక్రియ ఈనెల 31 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ షేక్ రేష్మా, ఐటీడీఏ ఏపీఓ రాజునాయక్, ఈసీ శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణ పరిరక్షణకు హాని



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ సిబ్బంది

మహానంది: ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి హాని కలుగుతుందని బండిఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్ ఝా తెలిపారు. మండలంలోని సోమయాజులపల్లె, నారపురెడ్డికుంట, పరమటూరు గ్రామాల్లో బుధవారం పర్యావరణ పరిరక్షణను కాపాడుకుందాం అంశంపై ప్రజలు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పచ్చదనం ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటరమణ, రామకృష్ణ, మదార్‌సాహెబ్, హైమావతి పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే వదలొద్దు

• డీఎస్పీ శ్రీనివాసరావు

నందికొట్కూరు: నేరాలకు పాల్పడితే ఎవరైనా సరే వదలొద్దని డీఎస్పీ శ్రీనివాసరావు పోలీసు అధికారులకు సూచించారు. బుధవారం పట్టణంలోని రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నేర సమీక్ష సమావేశంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా పోలీసులను సంప్రదించాలన్నారు. సమావేశంలో టౌన్ సీఐ విజయభాస్కర్, ఎస్‌ఐలు నాగార్జున, ఓబులేశు, మారుతీ శంకర్ పాల్గొన్నారు.

కళాశాలగా ఉన్నత పాఠశాల

నందికొట్కూరు: బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బాలికల జూనియర్ కళాశాలగా ఉన్నతీకరించినట్లు హెచ్ఎం ప్రాణేష్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బాలికల జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి ఏడుగురు అధ్యాపకులను నియమించిందన్నారు. ఇంటర్మీడియెట్ విద్యను ఎంపీసీ, బైపీసీ గ్రూపులు నిర్వహించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయన్నారు. కళాశాల నిర్వహించేందుకు కావాల్సిన అన్ని వసతులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

వలంటీరు పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

జూపాడుబంగ్లా: మండలంలోని తరిగోపుల, జూపాడుబంగ్లా-1 సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీరు పోస్టులకు ఆసక్తి ఉన్న వారు ఈనెల 25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ మంజులవాణి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ జూపాడుబంగ్లా-1 సచివాలయ పరిధిలో బీసీ-ఈ, తరిగోపులలో ఓసీ(జనరల్) వలంటీరు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పదోవ తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉన్న వారు అర్హులన్నారు. 26న దరఖాస్తులను పరిశీలించి, 27న ఇంటర్వ్యూలు నిర్వహించి, 30న ఎంపిక జాబితా ప్రకటించి జూన్ 1 విధుల్లోకి తీసుకుంటామన్నారు.

నల్లమల అడవిలో చెట్ల నరికివేత



చెట్లను నరికేసిన దృశ్యం

మహానంది: నల్లమల అడవిలో అక్రమార్కులు పెట్రేగిపోతున్నారు. తాజాగా మహానంది సమీపంలోని జీనశంకర తపోవనం సమీపంలోని నల్లమల అడవిలో సుమారు రెండు కిలోమీటర్ల లోపల బుధవారం గుర్తుతెలియని దుండగులు యూకలిప్టస్ చెట్లను కొట్టేసి తరలిస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది. ఎద్దులబండ్లు, ట్రాక్టర్లపై వీటిని తరలిస్తున్నట్లు సమాచారం. కొందరు ఇంటిదొంగలే వారికి సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై మహానంది డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సుబ్బయ్య మాట్లాడుతూ విచారణ చేస్తున్నామన్నారు. అక్రమంగా కొట్టిపడేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

అసంక్రమిత వ్యాధుల సర్వే పూర్తి చేయండి

నంద్యాల: డయాబెటిస్, హెపటటీస్ తదితర అసంక్రమిత వ్యాధుల సర్వే వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హైరిస్క్ కాన్పులు, సిజేరియన్ కాన్పులను ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో నిర్వహించాలన్నారు.



మహానంది సమీపంలో బుధవారం రాత్రి 10.40 గంటల సమయంలో కనిపించిన మెరుపు